

జాతరకు ప్రత్యామ్నాయ దారులు

మేడారం మహాజాతరకు ప్రత్యామ్నాయ దారుల ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క తెలిపారు. - 8లో▸



అమ్మానాన్న కోసం అన్వేషణ

స్వీడన్‌కు చెందిన సంధ్యారాణి ఆదివారం వరంగల్ నగరంలో తన తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/23°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'కుడా' చైర్మన్



నయీంనగర్: 'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సంవత్సర కాలంలో చేపట్టిన ప్రగతి నివేదికను అందించారు. వరంగల్‌ను స్మార్ట్ సిటీగా మార్చడానికి అన్ని విధాలుగా సహకరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్‌సెల్

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)లో సోమవారం గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరంగల్ కలెక్టరేట్‌లో..

న్యూశాయంపేట: ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు.


నేటినుంచి ప్రైవేట్ కళాశాలలు బంద్

కేయూ క్యాంపస్: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో తెలంగాణలో ఈనెల 15 నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీ, లా ఇతర వివిధ ప్రొఫెషనల్స్ కోర్సుల ప్రైవేట్ కళాశాలలు, 16 నుంచి డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్‌ను ప్రకటించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తాము కళాశాలలు నడిపే పరిస్థితిలో లేమని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. కేయూ పరిధి ఆయా కళాశాలలు కూడా నిరవధికంగా బంద్ చేస్తుండడంతో వర్సిటీ పరిధిలో ఇప్పటికే కొనసాగుతున్న వివిధ పరీక్షలు ప్రైవేట్ కళాశాలల నుంచి ప్రభుత్వ యాజమాన్యాల కళాశాలలకు పరీక్ష కేంద్రాలను మారుస్తూ ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ వెల్లడించారు.

కేంద్రాల మార్పు ఇలా..

ఈనెల 15న హనుమకొండ హంటర్ రోడ్డులోని అల్లూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ పరీక్ష కేంద్రంలో జరగాల్సిన ఎల్ఎల్‌బీ ఐదేళ్ల ఆరో సెమిస్టర్ పరీక్షను హనుమకొండలోని సుబేదారి వర్సిటీ మహిళా పీజీ కాలేజీ పరీక్ష కేంద్రానికి మార్చారు. ఈనెల 15, 17, 19 తేదీల్లో జరగాల్సిన ఫార్మ్ డీ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను మారుస్తూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల మార్పు వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీఇన్‌లో చూడొచ్చని పేర్కొన్నారు.

సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



ఎల్కతుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్రె భిక్షపతి హాజరై మాట్లాడారు. తెలంగాణలో నైజాం రాజుల నిరంకుశ, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఎదురుతిరిగారని తెలిపారు. ఆనాటి పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు, సానుభూతిపరులు అమరులయ్యారని వివరించారు. 3వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాలను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకొని పేదలకు పంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, నాయకులు మంచాల రమాదేవి, సుంచు కుమారస్వామి, బాలరాజు, రవి, కిషన్, ఉపేందర్, రాధిక, ఐలమ్మ తదితరులున్నారు.

పాకాలలో సందడి

ఖానాపురం: మండలంలోని పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మత్తడితో పాటు తూము ద్వారా లీకేజీ నీటిలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు.

నేడు జాతీయ ఇంజనీర్స్ డే

నిర్మాణం.. కళాత్మకం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అద్భుత కట్టడాలు



- చెక్కు చెదరని వందల ఏళ్ల నాటి గడీలు
- పర్యాటకులను ఆకర్షిస్తున్న శిల్పకళా సంపద
- కాకతీయుల కాలం నాటి ఇంజనీర్ల అపార మేథ

శత్రు దుర్భేద్యం. గాలి వెలుతురుకు ఆలవాలం, వాన నీటిని ఒడిసి పట్టేందుకు ఆస్కారం. వందల ఏళ్లైనా చారిత్రక కట్టడాలు కళాత్మకం. నాటి ఇంజనీర్ల అపార మేథకు నేటికీ చెక్కు చెదరని నిర్మాణాలే తార్కాణం. సాంకేతికత లేని రోజుల్లోనే అద్భుత కట్టడాలకు ప్రాణం పోసిన ఇంజనీర్లు నీటిలో తేలియాడే ఇటుకలతో ఆలయాల్ని నిర్మించారు. దంగు సున్నంతో గడీలు కట్టారు. సరిగమలు పలికే శిల్పాలు చెక్కారు. చూపుతిప్పనివ్వని కళాఖండాల్ని రూపొందించారు. నేడు (సోమవారం) ప్రముఖ ఇంజనీర్, పండితుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (నేషనల్ ఇంజనీర్స్ డే) సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అబ్బుర కట్టడాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి విస్నూరులో నిర్మించిన గడి



విస్నూరు గడి.. ఆధునిక ఒరవడి

పాలకుర్తి టౌన్: మండలంలోని విస్నూరులో 1935లో దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి హయాంలో గడి నిర్మించారు. సుప్రసిద్ధ ఇంజనీర్, జాతీయ కాంగ్రెస్ నేత వల్లూరి బస్వరాజు దేశంలోనే డిజైన్ చేసిన రెండు భవనాల్లో విస్నూరు గడి ఒక్కటి కావడం విశేషం. మొదటిది అలహాబాద్‌లో మాజీ ప్రధాని నెహ్రూ నివాసం ఆనంద్ భవన్ (ప్రస్తుతం మ్యూజియం) కావడం గమనార్హం. ఆ రోజుల్లో ఇక్కడ సిమెంట్ తయారీ ఫ్యాక్టరీలు లేవు. ఇంగ్లండ్ నుంచి పడవల్లో సిమెంట్ తెప్పించారు. బర్మా నుంచి టేకు కలప, జర్మనీ నుంచి గ్రానైట్, అమెరికా నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విద్యుత్ బల్బులు, జనరేటర్ తీసుకొచ్చారు. రెండంతస్తుల్లో నిర్మించిన ఈ భవనంలో అన్ని విశేషాలే. ఈ ప్రాంతంలో మొదటిసారి విద్యుత్ బల్బులు వెలిగింది ఈ గడిలోనే. విదేశాల నుంచి తెప్పించిన గ్రానైట్ రాయి నేటికీ తలతల మెరుస్తోంది. 5.03 ఎకరాల స్థలంలో పూర్తిగా వాస్తు శాస్త్ర ప్రకారం గడి నిర్మించారు. చుట్టూ 16 ఫీట్ల ఎత్తులో నిర్మించిన ప్రహరీ భవనానికి రక్షణగా ఉంది. శత్రు దుర్భేద్యంగా నిర్మించిన ఈ భవనాన్ని 1948లో కమ్యూనిస్టులు కూల్చి వేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. రాపాక రాంచంద్రారెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది.

కల్లెడ గడి ముఖద్వారం



శతాబ్దికి సమీపం.. నేటికీ పదిలం

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో 1930లో ఎర్రబెల్లి వీరయ్య కుమారుడు వెంకట్రామనర్సయ్య 150 గదులతో గడి నిర్మించారు. బొంబాయి ఆర్కిటెక్ ఇంజనీర్ల నైపుణ్యంతో 30 సంవత్సరాలపాటు నిర్మాణం సాగింది. దంగు సున్నం అక్కడే తయారు చేసి నిర్మాణం చేపట్టడం మరో ప్రత్యేకత. అదేవిధంగా గాలి, వెలుతురు వచ్చేందుకు కిటికీలు ఏర్పాటు చేశారు. వాన నీటి సంరక్షణకు, సూర్యకాంతి ఎక్కువ లభించేందుకు గదుల నిర్మాణం చేపట్టారు. మొత్తం 12ఎకరాల విస్తీర్ణం గల ఈ గడిలో 6 ఎకరాల ఖాళీ స్థలం ఉండగా.. 6 ఎకరాల్లో భవనం నిర్మించారు.


వసతులు ఘనం.. అతి పెద్ద భవనం

కాజీపేట అర్బన్: దక్షిణాదిలోనే అతి పెద్ద హాస్టల్ భవనంతో నిట్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నిట్‌లోని సివిల్ ఇంజనీర్లు 2009లో హాస్టల్ భవనానికి శ్రీకారం చుట్టారు. 10 అంతస్తుల్లో 1,800 మంది విద్యార్థులకు వసతి కల్పించేందుకు ఎటుచూసినా వీ ఆకారంలో కనిపించేలా భవనం నిర్మించారు. నాటి కాకతీయ కళాకారుల కీర్తి ప్రతిష్టను పెంపొందించేందుకు హాస్టల్ భవనానికి రామప్ప హాల్ ఆఫ్ రెసిడెన్సీగా నామకరణం చేయగా.. విద్యార్థులు ఆల్ట్రా మెగా హాస్టల్ 1.8కేగా పిలుచుకుంటున్నారు. చక్కటి గాలి, వెలుతురు వస్తుంది. నిట్ వరంగల్‌లో ప్రవేశం పొందిన బీటెక్ ఫస్ట్ ఇయర్, ఎంటెక్ విద్యార్థులకు హాస్టల్ భవనంలో వసతి కల్పిస్తారు. ఒక గదిలో నలుగురు విద్యార్థులకు సౌకర్యం కల్పించారు. జిమ్, కాఫీ షాపు, టీవీ రూంలు, బ్యాడ్మింటన్ కోర్టుల తోపాటు మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంజనీర్లు బహుళ అంతస్తు నిర్మాణంలో నిట్‌ను రోల్‌మోడల్‌గా తీసుకుంటున్నారు.



నిట్‌లోని రామప్ప రెసిడెన్సీ (1.8 కే హాస్టల్ భవనం)

ఇసుకనే పునాదిగా చేసి నిర్మించిన రామప్ప ఆలయం



చరిత్రకు సాక్ష్యం.. రామప్ప దేవాలయం

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేటలోని రామప్ప ఆలయం కాకతీయుల ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. సాండ్ బాక్స్ టెక్నాలజీతో (ఇసుకను పునాదిగా వాడడం) ఆలయాన్ని నిర్మించడం, నీటిలో తేలియాడే ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించడం నాటి కాకతీయుల సాంకేతిక కళానైపుణ్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. 1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయం 812 ఏళ్లు కావొస్తున్నా నేటికీ చెక్కు చెదరలేదు. ఆలయంలోని నాట్యమండప నల్లరాతి స్తంభాలపై పడిన సూర్యకిరణాలు పరావర్తనం చెంది రామలింగేశ్వరుడు నిత్యం కాంతివంతంగా దర్శనమిచ్చేలా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఎలాంటి సాంకేతికత లేని ఆ కాలంలోనే ఆలయంలో సరిగమలు పలికే పొన్నచెట్టు, నాలుగు కాళ్లతోనే ముగ్గురి ప్రతిమలు, దిష్టిచుక్క పెట్టడం, నాట్యమాడే మదనిక శిల్పాలు, దారం పట్టేంతా రంధ్రాలతో స్తంభం చెక్కడం, జీవకళ ఉట్టిపడేలా శిల్పాలను మలచడం నాటి కాకతీయుల ఇంజనీరింగ్ ప్రతిభకు కేరాఫ్‌గా రామప్ప ఆలయాన్ని చెప్పుకోవచ్చు.

మరిపెడ మండల కేంద్రంలోని గడి



సువిశాలం.. పాలనకు కేంద్రం

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని చరిత్రకు ఆనవాళ్లుగా నాటి గడి నిలుస్తోంది. ఒకప్పుడు తెలంగాణలో సంస్థానాధీశులు, దొరలు విశాలమైన గడీల నుంచి పరిపాలన సాగించారు. రెడ్డి సామాజిక వర్గం వారు ఆ గడీలను అధికార కేంద్రంగా చేసుకుని ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు శిస్తులు వసూలు చేసేవారు. మరిపెడ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి వంశస్తులు 1949–50 సంవత్సరంలో 4.20 ఎకరాల విశాలమైన స్థలంలో గడిని నిర్మించారు. 8 గదులతో రెండంతస్తుల గడి భవనాన్ని అప్పుడు సొంతంగా తయారు చేసుకున్న దంగు సున్నం, ఇటుకలు, రాళ్లతో నిర్మించారు. ఇందుకుగాను రూ. లక్ష ఖర్చయ్యింది. గడి చుట్టూ 20 ఫీట్ల ఎత్తులో ప్రహరీ నిర్మించారు. గడి ఆవరణలోనే 20 గుంటల్లో బావి నిర్మించి నీటిని సరఫరా చేశారు. 1995లో గడిని ఖాళీ చేసి హైదరాబాద్‌కు వెళ్లారు. కొంతకాలం నిరుపయోగంగా ఉన్న గడిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దానం చేశారు. వారు కూడా ఖాళీ చేసి వెళ్లి పోవడంతో ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి


కేయూ క్యాంపస్: సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని కాకతీయ యూనివర్సిటీ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీలో జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఐదో వార్షిక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సహజ వనరుల శాస్త్రీయ వినియోగంతోనే సమగ్రాభివృద్ధి జరుగనుందని అభిప్రాయపడ్డారు. ఏ ప్రాంతంలోనైనా నీటికొరతను అధిగమించేందుకు ఇంకుడుగుంతలు, చెక్‌డ్యాంల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. చెరువుల మధ్య అనుసంధాన వ్యవస్థను ఏర్పరిస్తే భూగర్భజలాల స్థాయిని పెంచి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఆచార్యులు అందె సత్యం మాట్లాడుతూ.. పారిశ్రామిక విప్లవం ద్వారానే ప్రపంచంలోని అనేక దేశాల జీడీపీ ఉత్పాదకత గణనీయంగా పెరిగిందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రిటైర్డ్ డీఎఫ్‌ఓ కాజీపేట పురుషోత్తం, వక్తలు మర్రి యాదవరెడ్డి, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, కృష్ణానంద్, లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఏడాది కాలంగా చేపట్టిన కార్యకలాపాల నివేదికను జనవిజ్ఞాన వేదిక జిల్లాప్రధాన కార్యదర్శి భిక్షపతి, ఆర్థిక నివేదికను బాధ్యులు పరికిపండ్ల వేణు ప్రవేశపెట్టారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు చేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు శ్రీనాథ్, ఆచార్య ఆంజనేయులు, డాక్టర్ రాములు, ఉమామహేశ్వర్‌రావు, శ్రవణ్‌కుమార్, ధర్మప్రకాశ్, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్, సుమలత, వందన అశోక్ ఉన్నారు.



జనవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

కిక్ బాక్సింగ్ సిటీ లీగ్ చాంపియన్‌షిప్

వరంగల్ అర్బన్ : వరంగల్ బల్దియా ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ సిటీ లీగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు 20 జిల్లాల నుంచి 350 విద్యార్థినీవిద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిసారి సిటీ లీగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌ఓ సత్యవాణి, సెక్రటరీ కైలాశ్‌యాదవ్, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రతినిధులు శ్రీలక్ష్మి, మహిపాల్, బందారి సంతోశ్, తిరుపతి, మణికంఠ, వెంకటేశ్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ బాధ్యులు, అధికారులు

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుపాక ఎల్లయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఏసుమల్ల రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 8 గంటలకు అన్ని గ్రామాల్లో, ఉదయం 9 గంటలకు మండల కేంద్రాల్లో సంఘం పతాకాన్ని ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం హనుమకొండకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలు అందించిన సభ్యులకు పురస్కారాలు అందించి సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు వనపాకల రాజయ్య, సత్తూరి చంద్రమౌళి, కామెర లక్ష్మణ్, కలకోట్ల ప్రతాప్, మేకల ప్రవీణ్, వల్లందాస్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎవరేమనుకుంటే మాకేంటి?

స్టడీ టూర్‌కు 2 బృందాలు

- మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది ప్రయాణం

వరంగల్ అర్బన్: 'ఎవరేమనుకుంటే మాకేంటీ? ఎన్ని విమర్శలొస్తే ఏమవుతుంది. మా మాటే శాసనం, మేం చెప్పిందే వేదం. చేసిందే తీర్మానం. మేం తలుచుకుంటే ఏమైనా చేయగలుగుతాం' అని నిరూపించుకున్నారు గ్రేటర్ వరంగల్ పాలకులు. మరో ఏడు నెలలు గడిస్తే పదవీ కాలం పూర్తవుతున్న తరుణంలో అధ్యయనం పేరిట విహార యాత్ర చేస్తున్నారంటూ జనాగ్రహం వెల్లువెత్తినా.. డోంట్ కేర్ అన్నట్లుగా ముందుకుసాగారు. ఆదివారం రెండు బృందాలుగా బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రైవేట్ బస్సుల్లో బయల్దేరారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో శాస్త్రీయ పద్ధతులు, సుందీరకణ తదితర అవసరాల కోసం వెళ్లారు. ఈ యాత్ర ఈనెల 19 వరకు యాత్ర కొనసాగనుంది. మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వాన్ షమీమ్, 66 మంది కార్పొరేటర్లు ఉండగా.. అందులో 55 మంది టూర్‌కు ఓకే చెప్పారు. 25 మంది అధికారులు, ఉద్యోగులు యాత్రకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కానీ, చివరి క్షణంలో ఐదుగురు కార్పొరేటర్లు వెళ్లలేదు. కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు, తనయులను కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. వీరి సొమ్మును బల్దియా పాలక వర్గం పెద్దలు భరిస్తున్నట్లు లెక్క రాస్తున్నారు. బల్దియాకు చెందిన కొంత మంది ఇంజనీర్లు, సూపరింటెండెంట్లు, సిబ్బంది ఈ యాత్రకు ఎంపిక చేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరం నుంచి నుంచి బస్సుల్లో బయల్దేరి వెళ్లగా.. హైదరాబాద్ శంషాబాద్‌లో విమానమెక్కి, ఇండోర్ నగరంలో దిగనున్నారు. మేయర్ తన హోదాకు తగ్గట్టుగానే బిజినెస్ క్లాస్‌లో ప్రయాణిస్తున్నారు. కార్పొరేటర్లు ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించినట్లు అధికారులు వెల్లడించారు. మేయర్ గుండు సుధారాణి ఇండోర్ నుంచి ఈనెల 16న సాయంత్రం వరంగల్ నగరానికి తిరిగి రానున్నారు. 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అదే రోజు మలివిడతగా రాజస్థాన్‌లోని జైపూర్ నగరానికి వెళ్లి అక్కడ స్టడీటూర్‌లో భాగస్వామ్యం కానున్నారు. పాలక వర్గం పెద్దల బిజినెస్ క్లాస్ విమానయానం ప్రయాణ ఖర్చులు బల్దియాకు అధికభారమనే విమర్శలు వినవస్తున్నాయి. ఈ టూర్ కోసం రూ.50 లక్షల స్మార్ట్‌సిటీ నిధులను వెచ్చిస్తున్నారు.



స్టడీ టూర్ బస్సును జెండా ఊపి ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్లతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

18 మందిపై వీధి కుక్కల దాడిపై స్పందన కరువు

వరంగల్ చింతల్‌లో కుక్కల కాటుతో ఆదివారం ఉదయం 18 మందికి గాయాలైనప్పటికీ పాలక వర్గం, పెద్దలు, స్థానిక కార్పొరేటర్, ప్రజారోగ్యం అధికారులు ప్రజలు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సొమ్ముతో స్టడీ టూర్ వెళ్లడమా? సమస్యలు పరిష్కరించకుండా కట్టకట్టుకుని నిబంధనలను విస్మరిస్తూ ప్రయాణించడంపై పెదవి విరుస్తున్నారు. కాగా.. దేశంలోని ఇండోర్, జైపూర్ నగరాలు సమగ్ర శానిటేషన్, ఆధునిక పద్ధతులతో అత్యున్నత స్థానాలను దక్కించుకుంటున్నాయని, స్టడీ టూర్ కోసం బల్దియా పాలక వర్గం, అధికారుల బృందం వెళ్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బృందాలు వెళ్తున్న బస్సులను ఎమ్మెల్యే నాయిని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పాలక వర్గం పెద్దలు, కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

కేవైసీ చేసుకుంటేనే ఉపాధి

- పైలట్ ప్రాజెక్టుగా హనుమకొండ ఎంపిక

శాయంపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు తమ ఆధార్ కార్డులను జాబ్ కార్డుతో కేవైసీ చేసుకుంటేనే అక్టోబర్ 1 నుంచి ఉపాధి పని కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా హనుమకొండ, కరీంనగర్ జిల్లాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గత బుధవారం నుంచి గ్రామాల్లో కూలీల కేవైసీ నమోదు ప్రక్రియను అధికారులు చేపట్టారు.

ప్రక్రియ ఇలా..

కేవైసీ నమోదు ప్రక్రియ కోసం ఎన్ఆర్ఈజీఏ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ అనే యాప్ ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కూలీలకు సంబంధించిన వివరాలను అధికారులు అందులో నమోదు చేస్తున్నారు. ఈ విధానంతో పారదర్శకత పెరిగే అవకాశం ఉంది. దీంతోపాటు ఒక జాబ్‌కార్డుపై మరొకరు పనిచేసే అవకాశం ఉండదు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లింగారెడ్డి

విద్యారణ్యపురి: విద్యారంగం, టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని డీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీని అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన టీచర్ల పదోన్నతుల్లో మిగిలిపోయిన పోస్టుల్లో అర్హులైన ఉపాధ్యాయులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, టీచర్ల శిక్షణ కార్యక్రమాలు వేసవి సెలవుల్లోనే ఇవ్వాలని, విద్యేతర ఆన్‌లైన్ కార్యక్రమాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయులకు డైట్ లెక్చరర్లుగా, ఎంఈఓలుగా, డిప్యూటీ డీఈఓలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జి.ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, బాధ్యులు బి.అంజనీదేవి, ఎస్.సుమ, డాక్టర్ కిషన్, ఎ.మల్లయ్య, డి.రమేశ్, టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.లింగారెడ్డి

క్లుప్తంగా

లోక్ అదాలత్‌ల్లో 10,321 కేసుల పరిష్కారం

వరంగల్ క్రైం: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10,321 కేసులు పరిష్కారమైనట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదివారం తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.83 లక్షలు అందజేయాలని కోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ కేసులు 1,079, ఈ–పెట్టి కేసులు 6,012, డ్రంకెన్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు 3,003, సైబర్ కేసులు 227 పరిష్కారమైనట్లు వివరించారు. ఇరువర్గాల మధ్య రాజీకుదిర్చి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

రిజిస్ట్రేషన్లకు ధరల భారం

కాజీపేట అర్బన్ : భూక్రయ విక్రయదారులకు తమ భూమి రిజిస్ట్రేషన్లలో భారం పెరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు మార్కెట్ వాల్యూ పెంచే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్కెట్ విలువలు పెరిగే ప్రతిపాదనలను అందజేశారు. కాగా, దసరా బొనాంజగా భూభారం పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న ధరలకు ఒక్క శాతం అదనంగా పెరగనుందా లేక అధిక భారం మోపనుందా అనే అంశం త్వరలో ప్రభుత్వం విడుదల చేసే జీఓతో తేలనుంది.

అమ్మానాన్న కోసం అన్వేషణ

- వేయి కళ్లతో కుమార్తె ఎదురుచూపులు
- తల్లిదండ్రుల కోసం స్వీడన్ నుంచి వరంగల్‌కు
- పద్మశాలి సంఘం ప్రతినిధులను కలిసిన సంధ్యారాణి

కన్నవారి కోసం సముద్రాలు దాటి వచ్చింది. వేల కిలోమీటర్లు ప్రయాణించింది. భాష రాకపోయినా.. తెలిసిన వారెవరూ లేకపోయినా.. అమ్మానాన్న జాడ కోసం 16 ఏళ్లుగా అన్వేషిస్తోంది. వారి ఫొటోలు లేకపోయినా, ఆనవాళ్లు తెలియకపోయినా.. వారిని కలుస్తాననే దృఢ నిశ్చయంతో ఉంది. కన్నవారిని కలిసేదాకా నిద్రపోనని చెబుతున్న స్వీడన్‌కు చెందిన సంధ్యారాణి ఆదివారం వరంగల్ నగరంలో తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నించింది.



వరంగల్‌కు వచ్చిన సంధ్యారాణి

ఖిలా వరంగల్: చిన్నతనంలో ఓ అనాథాశ్రమంలో పెరిగిన సంధ్యారాణి తల్లిదండ్రుల కోసం అన్వేషిస్తోంది. కన్నవారిని కలవాలని స్వీడన్ దేశం నుంచి ఆమె ఆదివారం వరంగల్‌కు వచ్చింది. తల్లిదండ్రుల మూలాలు ఇక్కడే ఉన్నాయని వరంగల్ శివనగర్‌లోని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్‌తోపాటు పద్మశాలి సంఘాల ప్రతినిధులను కలిసింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. ‘మా తల్లిదండ్రులు రాజ్‌కుమార్, అనసూయ. కొందరు నా తల్లి చనిపోయిందని అంటున్నారు. కానీ, ఆమె చనిపోలేదు. నా వయసు రెండేళ్లు ఉన్నప్పుడు బతుకుదెరువు కోసం నాన్న నన్ను తీసుకుని హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ప్రేమ్‌నగర్ వెళ్లాడు. అక్కడ నిజాం కాలేజీ తోటమాలి రామయ్యతో



పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులతో సంధ్యారాణి

ఆయనకు పరిచయం ఏర్పడింది. అక్కడే ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేశాడు. ఈ విషయం తెలిసి రామయ్య తన మరదలు విజయను నాన్నకు ఇచ్చి వివాహం చేశాడు. మూడు నెలలు ఆమెతో కాపురం చేసిన ఆయన ఓ రాత్రి నన్ను విజయ దగ్గరే వదిలేసి పత్తాలేకుండా వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం రామయ్య గాలించినా దొరకలేదు. దీంతో విజయ.. మూడేళ్ల వయసున్న నన్ను విజయనగర్ కాలనీలోని ‘సేవా సమాజం.. బాలికా నిలయం’ అనే అనాథాశ్రమంలో వదిలేసింది.

ఆశ్రమం నుంచి స్వీడన్‌కు దత్తత..

సంతానం లేని స్వీడన్‌కు చెందిన లిండ్, గ్రేస్ నన్ను ఆశ్రమం నుంచి దత్తత తీసుకున్నారు. చిన్నతనం నుంచి అక్కడే పెరిగి పెద్దయ్యా. ఊహ తెలిసినప్పటి నుంచి స్వీడన్ నా దేశం కాదు.. వాళ్లు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కాదని గ్రహించా. పైచదువుల కోసం యూకే వెళ్లాక ఓ ఫ్రెండ్ ప్రేరణతో నా అసలు పేరెంట్స్ గురించి 2009 నుంచి అన్వేషణ ప్రారంభించా. ఇందులో భాగంగా ఆదివారం వరంగల్ శివనగర్‌కు చేరుకున్నా. పద్మశాలి సంఘం ప్రతినిధి, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్‌ను కలిశా. తన తండ్రి రాజ్‌కుమార్, తల్లిపేరు అనసూయ. ఏళ్లు గడుస్తున్నా వారి ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రులను కలుసుకోవాలని ఇండియాకు వచ్చా. మూలాలు వెతుక్కుంటూ హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చా. నా తల్లిదండ్రులు తెలిస్తే 98222 06485 నంబర్‌కు కాల్‌చేయండి. తల్లిదండ్రులను ఎలాగైనా కలుస్తాననే నమ్మకం నాలో దృఢంగా ఉంది’ అని సంధ్యారాణి కన్నీటి పర్యంతమైంది.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా ఉంటాం

- టీఎస్ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం మనోహర్

హన్మకొండ: విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యాం మనోహర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడి రమేశ్ అన్నారు. శనివారం రాత్రి హనుమకొండ విద్యుత్ నగర్‌లోని డీఏపీఈఏ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల నుంచి అసోసియేషన్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమ సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.ఆనందం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.కుమారస్వామి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు కలకుంట్ల మాణిక్యం, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.నాంపల్లి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.చంద్రయ్య పాల్గొన్నారు.



రాష్ట్ర నాయకులతో నూతన కమిటీ

ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: రెండు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–5 నుంచి 18 బాలబాలికలకు రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి రోజు ఉనికిచర్లలోని ఎస్ఎస్‌హౌస్ వద్ద నిర్వహించగా, రెండో రోజు రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరైనట్లు స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధార్థ, ఓం ప్రకాశ్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తామనే వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. విజేతలకు డీపీఎస్ ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి బహుమతులు అందజేశారు.



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- ప్రథమ స్థానంలో ఆదిలాబాద్, మెదక్ జట్లు

జఫర్‌గఢ్ : జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి 44వ సబ్ జూనియర్ ఇంటర్‌షిప్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలికల విభాగంలో మెదక్ జట్టు మొదటి స్థానం, ఖమ్మం ద్వితీయ, వరంగల్ తృతీయ, ఆదిలాబాద్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ ప్రథమ, నల్లగొండ ద్వితీయ, కరీంనగర్ తృతీయ, నిజామాబాద్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదెపాక అయోధ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు జయాకర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి రమణ హాజరై మాట్లాడారు. దేశంలో క్రీడలు, క్రీడాకారులకు గుర్తింపు ఉందన్నారు. మారుమూల ప్రాంతమైన కూనూర్‌లో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు నారాయణరెడ్డి, వీరభద్రరావు, రవీందర్ కుమార్, వీరయ్య, కమల్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన ఆదిలాబాద్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పోగొట్టుకున్న నగదు బ్యాగు అందజేత

ఖిలా వరంగల్: పోగొట్టుకున్న నగదు బ్యాగు బాధితుడికి అందజేశారు. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన మహమ్మద్ అఫ్సర్ సెకండ్ హ్యాండ్ బొలెరో వాహనం కొనుగోలు చేసేందుకు శనివారం హైదరాబాద్ నుంచి నేరుగా మడికొండకు చేరుకున్నాడు. కన్సల్టెన్సీలో సెకండ్ సేల్స్ వాహనాలు నచ్చకపోవడంతో మడికొండ నుంచి నేరుగా ఆటో ఎక్కి వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో దిగాడు. వాహనం కొనుగోలు కోసం వెంట తెచ్చిన రూ.3 లక్షల నగదు గల బ్యాగును ఆటోలోనే మర్చిపోయాడు. కన్సల్టెన్సీకి వెళ్లి చూసుకుంటే ఆటోలో రూ.3 లక్షల బ్యాగు మర్చిపోయానని గ్రహించి వెంటనే శనివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ చాలెంజ్‌గా తీసుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాగు మరిచిపోయిన ఆటోను కనిపెట్టి కాజీపేటకు చెందిన ఆటో డ్రైవర్ యాసిన్‌ను అభినందించి, రూ.3లక్షల బ్యాగును బాధితుడు మహమ్మద్ అఫ్సర్‌కు ఆదివారం ఇన్‌స్పెక్టర్ బొల్ల రమేశ్ చేతుల మీదుగా అందజేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే బ్యాగును కనిపెట్టి బాధితుడికి అప్పగించేందుకు సహకరించిన ఎస్సై శ్రావణ్, క్రైం పార్టీ కానిస్టేబుల్ జంపాల నాగేశ్వరరావును ఏఎస్పీ శుభం, ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ అభినందించారు.



పోగొట్టుకున్న రూ.3లక్షల నగదును బాధితుడికి అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్

జాతరకు ప్రత్యామ్నాయ దారులు..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- అటవీ ప్రాంతాల్లో రోడ్ల ఏర్పాట్ల పరిశీలన
- బైక్‌పై మూడు కిలోమీటర్ల ప్రయాణం..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మహాజాతరకు ప్రత్యామ్నాయ దారుల ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈసారి మహాజాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రోడ్ల ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ శబరీశ్‌తో కలిసి పరిశీలించారు. గోవిందరావుపేట మండలం మొట్లగూడెం నుంచి ముత్తాపురం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు, కొండపర్తి మీదుగా గోనెపల్లి వరకు, గోనెపల్లి నుంచి మేడారంలోని శివరాంసాగర్ సమీపంలోని వీవీపీ వరకు, వీవీపీ పార్కింగ్ నుంచి చిలకలగుట్ట వరకు రోడ్ల ఏర్పాటును పరిశీలించారు. ఈసారి జాతరకు నూతన రోడ్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ తలెత్తకుండా ఉంటుందని భావించారు. కాగా, కొండపర్తి నుంచి ఒకదారి, ముత్తాపురం నుంచి మరో దారి, ఈరెండు దారులు కూడా గోనెపల్లిలో కలిసి జంక్షన్ ఏర్పడనుంది. అక్కడ నుంచి ఈ దారులు ప్రత్యామ్నాయం కానున్నాయి. కాగా, మంత్రి జాతీయ రహదారి నుంచి కొండపర్తి మీదుగా అటవీ మార్గ గుండా గోనెపల్లి వరకు బైక్‌పై సుమారు 3 కిలోమీటర్లు అటవీ మార్గంలో పర్యటించి రోడ్డు ఏర్పాటును పరిశీలించారు. డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ దయాకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



రోడ్లను పరిశీలించేందుకు బైక్‌పై వెళ్తున్న మంత్రి సీతక్క

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని మంత్రికి వినతి

మండలంలోని నార్లాపూర్ చెక్ పోస్టు సమీపంలోని కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని మంత్రి సీతక్కకు నార్లాపూర్ రైతులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. కల్వర్టు కింద పైపులు చిన్నగా ఉండడంతో జంపన్నవాగు వరద తాకిడికి కల్వర్టుకు ఇరువైపులా ఉన్న వందలాది ఎకరాల వరి పంట నీటమునిగిపోతుందని విన్నవించారు. స్పందించిన మంత్రి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, మేడారం జాతర చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఉద్రిక్తత

- ఇద్దరు విద్యార్థులపై దాడి చేసిన వారిపై కేసు

కేయూ క్యాంపస్: కేయూలో ఇద్దరు విద్యార్థులపై దాడి ఘటనతో శనివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎంబీఏ ఫస్టియర్ విద్యార్థులు గజానంద్, పవన్ శనివారం రాత్రి 8: 20 గంటలకు బైక్‌పై కామన్ మెస్‌కు వెళ్తుండగా గెస్ట్ హౌస్ ప్రాంతంలో పలువురు అడ్డుకుని దాడి చేశారు. దీంతో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. దాడిచేసి కొట్టినవారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్ వాహనంలో తరలించే యత్నం చేశారు. అక్కడికి చేరుకున్న విద్యార్థులు వాహనాన్ని అడ్డుకొని రాత్రి 11:30 గంటల వరకు ఆందోళన చేపట్టారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ తదితరులు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని సర్దిచెప్పారు. చివరికి పోలీసులు ఇద్దరిని మాత్రం అదుపులోనికి తీసుకొని వెళ్లారు. ఆ తర్వాత వదిలివేసినట్లు సమాచారం. బాధిత విద్యార్థులు గజానంద్, పవన్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గట్టు ప్రశాంత్, అఖిల్‌తోపాటు మరికొందరిపై కేసును నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నాన్‌బోర్డర్లు రాకుండా చర్య తీసుకోవాలి

హాస్టళ్లలోకి నాన్‌బోర్డర్లు రాకుండా చూడాలని ఆదివారం సాయంత్రం 6:45 గంటలకు విద్యార్థులు కేయూ మొదటి గేట్ వద్ద ఆందోళన చేశారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, హాస్టళ్ల డైరెక్టర్ వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాన్‌బోర్డర్లపై కేయూ అధికారులు చర్యలు తీసుకుంటే సహకరిస్తామని పేర్కొన్నారు. దీంతో రాత్రి 11 గంటలకు ఆందోళన విరమించారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర చీఫ్ పాట్రన్ సంజీవరెడ్డి

విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 60 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర చీఫ్‌పాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో టీఆర్‌టీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ స్టేట్ జాయింట్ కౌన్సిల్‌లో టీఆర్‌టీఎఫ్‌నకు తిరిగి ప్రాతినిధ్యం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కోకన్వీనర్ దాక్షపు విష్ణుమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఆర్‌టీఎఫ్ బాధ్యులు పెండెం మధుసూదన్, రాజునాయక్ మాడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రెండు జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న లక్కిరెడ్డి సంజీవరెడ్డి

హనుమకొండ జిల్లా కార్యవర్గం..


టీఆర్‌టీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బాసిరి రాజబాపురావు, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా గుండు సదానందం, బంగారు స్వామి ఎన్నికయ్యారు.



రాజబాపురావు

వరంగల్ జిల్లా..

టీఆర్‌టీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వద్దె కిషన్, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షులుగా భక్తిని రాజేశ్, శ్రీపతి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శులుగా ల్యాద లింగమూర్తి, కలకోట ప్రభాకర్, బుర్ర మొగిలి, శివశంకర్ ఎన్నికయ్యారు. సమావేశంలో బాధ్యులు మాడిశెట్టి శ్రీనివాస్, సర్వర్‌నాయక్, సారంగం, మురళి పాల్గొన్నారు.



వద్దె కిషన్

పెంపకమే ప్రాధాన్యం..

- దూడల సంరక్షణతోనే పాడి వృద్ధి
- మడికొండ, మల్కాపూర్ పశువైద్యాధికారులు కరుణాకర్ రెడ్డి, అనేష్

కాజీపేట/చిల్పూరు : పాడి అభివృద్ధికి పెయ్యదూడల సంరక్షణనే కీలకం.. దూడల పెంపకంపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని పశువైద్యాధికారులు తెలిపారు. దూడల పెంపకంపై శ్రద్ధ వహిస్తే అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. పెయ్యదూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి, మల్కాపూర్ పశువైద్యాధికారి మూడిక అనేష్ సూచనలు..

జాగ్రత్తలు తప్పనిసరి..

పెయ్యదూడలు పుట్టినప్పటి నుంచి ఎదకు వచ్చే వరకు వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. దూడలు బలంగా, ఆరోగ్యంగా ఉండేలా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన దూడకు వెంటనే జున్ను పాలు తాగించాలి. దీంతో దూడలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో వాటికి వ్యాధులు సోకకుండా, ఆరోగ్యంగా ఉంటాయి. అయితే అవగాహన లేక కొంతమంది రైతులు పాడి పశువుల నుంచి మొత్తం పాలను పితుకుతారు. దీంతో దూడలకు పాలు సరిపోక నీరసించి, వ్యాధి నిరోధక శక్తి కోల్పోతుంది. అనంతరం వ్యాధుల బారిన పడి మృత్యువాత పడే అవకాశం ఉంది. అందుకే రైతులు దూడలకు సరిపడా పాలు అందేలా జాగ్రత్త వహించాలి.



పశువుల పాకలో దూడలు

దూడలకు సోకే వ్యాధులు..

పెయ్యదూడల సంరక్షణలో వాటికి పలు వ్యాధులు సోకే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఇతరత్రా వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా దూడలకు అతిసార, తెల్లపారుడు, న్యూమోనియా, రక్తవిరోచనాలు, కీళ్ల నొప్పులు, బొడ్డువాపు వ్యాధులతో పాటు ఇతరత్రా వ్యాధులు, పరాన్న జీవులతో వ్యాప్తి చెందుతాయి. దూడలు ఎటువంటి రోగాల బారిన పడకుండా పెరిగితే రైతుకు ఆదాయమే. వీటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.


పాడి పరిశ్రమ వైపు మొగ్గు..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తదితర పనుల నిర్వహణకు తగినంత సాగునీరు లేకపోవడంతో రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రారంభంలో ఒకటి, రెండు ఆవులను కొనుగోలు చేసి పాడిని ప్రారంభిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఉదయం, సాయంత్రం కొద్దిపాటి సమయం పాడి పశువుల కోసం సమయం కేటాయిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. ఇప్పటికే ఆవులను కొనుగోలు చేసి, లాభాలు పొందుతున్న రైతులను గమనిస్తున్న ఇతరులు పాడి ఆవులను కొనుగోలు చేసి పాడి పరిశ్రమపై ఆధారపడేందుకు మొగ్గు చూపుతున్నారు. దూడలను కాపాడుకుంటూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి..

పాడి రైతులు పుట్టిన దూడల పెంపకంపై జాగ్రత్త వహించకుండా పాలిచ్చే ఆవులపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. లేగదూడలు పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. బొడ్డు కోసే సమయంలోనూ జాగ్రత్త అవసరం. లేగదూడల వయస్సును బట్టి అవి బలిష్టంగా పెరిగేందుకు సరిపడా పాలు మిగల్చడం ఎంతో ముఖ్యం. దూడలు ఆరోగ్యంగా పెరిగితేనే భవిష్యత్‌లో అధిక మొత్తంలో పాలు ఇస్తాయి. పెంపకంలో ఎటువంటి అనుమానం తలెత్తిన వెంటనే సమీపంలోని పశువైద్యాధికారిని సంప్రదించాలి. వెంటనే అనుమానాన్ని నివృత్తి చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలి. లేకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాడిపశువుల విషయంలో పరిశుభ్రత ముఖ్యమైందని పెంపకందారులు గుర్తించాలి.

నూతన కమిటీ ఎన్నిక



సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, మల్లికార్జున్, ఇంద్ర సేనా రెడ్డి


హన్మకొండ: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండ విద్యుత్ నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి విద్యుత్ డిప్లొమా ఇంజనీర్స్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.మల్లికార్జున్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎం.అనిల్ కుమా ర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శిగా భవాని, సలహాదారులుగా మధుసూదన్, మనోహర్, కార్యవర్గ సభ్యులుగా తరుణ్, వరుణ్, జ్యోతిర్మయి, వి.రాములు, లక్ష్మణ్ నాయక్, వాలు నాయక్, జి.సత్యనారాయణ, టి.యగంధర్, ఖలీం, టి.శ్రీనివాస్, క్రాంతి కుమార్ ఎన్నికయ్యారు.

శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హన్మకొండ కల్చరల్: ఈనెల 22 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు వేయిస్తంభాల ఆలయంలో జరిగే రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం రాత్రి వేయిస్తంభాల ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఘనంగా స్వాగతించారు. పూజల అనంతరం కేంద్ర పురావస్తుశాఖ సీఏ అజిత్‌తో కలిసి దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ఆలయంలో జరిగే నవరాత్రి మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున విద్యుత్ అలంకరణ చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, జీవీఎస్ శ్రీనివాస్‌చారి, తోట పవన్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ఆలయ సిబ్బంది మధుకర్, ఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల దీవెనలతోనే గెలిచా..

వరంగల్ అర్బన్: ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పాలకవర్గం, అధికారుల స్టడీ టూర్ బృందాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ఆయనను వివరణ కోరగా.. 40 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. అదృష్టంతోపాటు కష్టార్జితం, పార్టీకి చేసిన సేవలు, ప్రజల దీవెనలతోనే గెలిచానన్నారు. మంత్రి కొండా సురేఖకు తల్లి, అక్క హోదాను ఇచ్చానని పేర్కొన్నారు. తనపై చేసిన వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా అన్నారు. ఎవరి హద్దుల్లో వారు ఉండి పని చేస్తే ఇలాంటి పరిస్థితులు రావని, జిల్లాలోని అందరు నేతలతో విభేదాలకు పోతే అభివృద్ధి కుంటు పడుతుందని అభిప్రాయపడ్డారు.



వేయిస్తంభాల ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు